

## బాధిత కుటుంబానికి పరామర్శ

కడ్తాల్, డిసెంబర్ 27: నియోజకవర్గంలో ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన రాయికంటి సాలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జైపాల్‌యాదవ్ శుక్రవారం ఉదయం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్‌తో కలిసి సాలమ్మ మృతదేహానికి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరపున రూ.5 వేలను జైపాల్‌యాదవ్ అందించారు. అదే విధంగా బాధిత కుటుంబానికి మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ రెడ్డి రూ.5 వేలు ఆర్థిక సాయం చేశారు. పరామర్శించిన వారిలో పీఏసీఎస్ డైరెక్టర్ వీరయ్య, ఆర్యవైశ్య సంఘం మండల గౌరవాధ్యక్షుడు శ్రీను, నాయకులు లాయక్‌అలీ, నర్సింహ, పాండు, సురేశ్, భిక్షపతి, రాజు, శ్రీకాంత్, జంగయ్య ఉన్నారు.

## దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



దివ్యాంగులకు బస్‌పాసులను అందజేస్తున్న లక్ష్మీపతిగౌడ్

యాచారం, డిసెంబర్27: మండలంలోని నల్లవెల్లి గ్రామంలో దివ్యాంగులకు మాజీ ఎంపీటీసీ లక్ష్మీపతిగౌడ్ ఆధ్వర్యంలో ఉచితంగా బస్‌పాసులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. దివ్యాంగులు ఆత్మస్థైర్యం కోల్పోకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో దివ్యాంగులు, గ్రామస్తులు ఉన్నారు.

### గట్టుఇప్పలపల్లిని మండలంగా
## ఏర్పాటు చేయాలి



కడ్తాల్, డిసెంబర్ 27: గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేసే వరకు పోరాటం ఆగదని మండల సాధన సమితి నాయకులు అన్నారు. తలకొండపల్లి మండల పరిధిలోని గట్టుఇప్పలపల్లి గ్రామాన్ని మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ, గ్రామస్తులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 57వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఇచ్చిన హామీ మేరకు గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్ర, కారదర్శి ఆంజనేయులుగౌడ్, అనిల్, నాయకులు కృష్ణ, మహేశ్, శేషునాయక్, అల్లావుద్దీన్, గౌస్, మాణిక్యంరెడ్డి పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చివేత



చేవెళ్లటౌన్, డిసెంబర్ 27: చేవెళ్ల మండల కేంద్రంలోని రాజేంద్రరెడ్డి విగ్రహం నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేదారిలో వరద నీరుతో రోడ్డుకు పక్కల గుంతలు పడ్డాయి. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తడంతో చేవెళ్ల ట్రాఫిక్ ఏఎస్సై చంద్రనాయక్ సిబ్బందితో కలిసి సిమెంట్ వేయించి గుంతలను పూడ్చివేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ట్రాఫిక్ పోలీసులు సిబ్బంది దశరథ, నందిని, అనురాధ పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయానికి విరాళం



చేవెళ్ల రూరల్, డిసెంబర్ 27 : మండల పరిధి తంగడిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ నిర్మాణానికి దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందజేస్తున్నారు. శుక్రవారం తంగడిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంటీసీపీ గొల్లగూడెం లక్ష్మీరెడ్డి కుమారులు విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం రూ.51వేలు విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. అలాగే గ్రామానికి చెందిన మల్వాదా నర్సింహులు రూ.21 వేలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు వారిని సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు సత్తయ్య, రాములు, శ్రీనివాస్, కృష్ణయ్య, చంద్రయ్య, పరమయ్య, నవాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు



మన్సూరాబాద్, డిసెంబర్ 27: వైదిక విజ్ఞాన ట్రస్ట్ ఆధ్వర్యంలో నాగోల్ డివిజన్ పరిధి జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కులో రుగ్వేద, యజుర్వేద, సామవేద హవన సహిత గజేంద్రమోక్ష ప్రవచన పాంచాహ్నిక జ్ఞాన యజ్ఞ మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. యజ్ఞ మహోత్సవాల్లో భాగంగా నాల్గో రోజు శుక్రవారం బ్రహ్మశ్రీ హరిసీతారామమూర్తి సలక్షణ ఘనపాటి స్వామీజీ అధ్యక్షతన చతుర్వేద సభ, వేద స్వస్తి, వేదాశీర్వచనము, పండిత సన్మానం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నిర్వహించిన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. యజ్ఞ మహోత్సవాలకు భద్రాచల ఆస్థాన వేద పండితులు, ఉభయ వేదాంత విద్వాన్ గుదిమెళ్ల మురళీ కృష్ణమాచార్యులు హాజరై ప్రవచన కార్యక్రమాన్ని నిర్వహించారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

# ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటాం

**ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**

నందిగామ, డిసెంబర్ 27 : ఆపదలో ఉన్న ప్రజలకు అండగా ఉంటామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. నందిగామ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎం.రాజు, శ్రీనివాసులగూడకు చెందిన అంజయ్య, ఫరూఖ్‌నగర్ మండలం బూర్గులకు చెందిన గోపాల్‌కు, జ్యోతికి, మధురపూర్‌కు చెందిన శివకుమార్‌లకు సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు, అనారోగ్య సమస్యలతో చికిత్స పొందిన ప్రజలకు ఎల్‌వోసీ అవసరమైన వారికి సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా సాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు.

# ప్రభుత్వం హామీలను వెంటనే నెరవేర్చాలి



టోకెన్ సమ్మెలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు, పంచాయతీ కార్మికులు

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబర్ 27 : ఎన్నికల ముందు కాంగ్రెస్ సర్కారు గ్రామపంచాయతీ ఉద్యోగ, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ బుగ్గరాములు డిమాండ్ చేశారు. ఈ నెల 27, 28 తేదీల్లో టోకెన్ సమ్మె పిలుపులో భాగంగా శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయటంతో పాటు సిబ్బందిని పర్మినెంట్ చేసి, కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు. కారోబార్, బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. రూ.5లక్షల ఇన్సూరెన్స్ పథకాలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కారోబార్లు దేవదాసు, ఐలయ్య, మల్లేశ్, సిబ్బంది నరేశ్, బాలరాజు, కిషన్, అశోక్, అనిత, రాణమ్మ, పార్వతమ్మ, ఆండాలు, స్వామి పాల్గొన్నారు.

## మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

కడ్తాల్, డిసెంబర్ 27: పంచాయతీ కార్మికులకు పని ఒత్తిడికి గురి చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గ్యార పాండు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ, జీపీ ఉద్యోగ కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు, శుక్రవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు నిర్వహించిన సమ్మెలో పాండు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని తెలిపారు. ఆరు నెలల నుంచి పది నెలల వరకు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. పార్టీ అధికారంలోకి వస్తే మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి వేతనాలు పెంచుతామని, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేస్తామని ఇచ్చిన హామీలు ఎక్కడా అని ప్రశ్నించారు. సమస్యలను పరిష్కరించాలని మంత్రి సీతక్కకు విన్నవించినా పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కారోబార్లు, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని, పదవి విరమణ సమయంలో రూ.5 లక్షలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య, గ్రామ పంచాయతీ యూనియన్ మండల అధ్యక్షుడు కుమార్, సభ్యులు చెన్నయ్య, మహేశ్, కృష్ణయ్య పాల్గొన్నారు.



సమ్మెలో మాట్లాడుతున్న తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాండు

## గ్రామాల అభివృద్ధికి కృషి

**చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి**

చేవెళ్ల రూరల్, డిసెంబర్ 27 : గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. చేవెళ్ల మండల పరిధి దేవునిఎర్రవల్లి, అంతారం, మల్కాపూర్ గ్రామాలకు సీసీ రోడ్ల నిర్మాణానికి గాను ఎంపీ లాడ్స్ నిధుల కింద ఒక్కో గ్రామానికి రూ.5 లక్షల చొప్పున రూ.15 లక్షల నిధుల మంజూరుకు సంబంధించిన ప్రొసీడింగ్ పత్రాలను శుక్రవారం బీఎస్ఎన్ఎల్ బోర్డు అడ్వైజరీ కమిటీ సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, వార్డు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టడానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు, ప్రజలు తమ మస్యలను నేరుగా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయించినందుకు సామ మాణిక్యరెడ్డి, మూడు గ్రామాల ప్రజలు ఎంపీకి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఎంపీని కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే రత్నం, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గుండన్నగారి వెంకట్‌రెడ్డి, హరి, ఎదిరె శ్రీశైలం తదితరులు ఉన్నారు.



సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

### పాడి రైతుల
## సమస్యలు పరిష్కరిస్తాం

కడ్తాల్, డిసెంబర్ 27: పాడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాలశీతలీకరణ కేంద్రాన్ని ఆయన స్థానిక నాయకులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాలశీతలీకరణ కేంద్రం సమస్యలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. పాడి రైతుల సమస్యలతో పాటు పాలశీతలీకరణ కేంద్రం సమస్యలను ప్రభుత్వంతో చర్చిస్తానని ఆయన హామీ ఇచ్చారు. పాల బిల్లులు సకాలంలో చెల్లించే విధంగా సంబంధిత అధికారులతో మాట్లాడుతానని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ, వెంకటేశ్, బీచ్యానాయక్, లక్ష్మయ్య, యాదగిరిరెడ్డి, జహంగీర్‌అలీ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాకు
## అంతరాయం

యాచారం, డిసెంబర్27: చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మండలంలోని చింతపట్ల, నందివనపర్తి 11కేవీ ఫీడర్ల కింద శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని చింతపట్ల గ్రామం, వ్యవసాయ పొలాలు, నజ్దిక్‌సింగారం, నందివనపర్తి రైస్‌మిల్లు, కోళ్ల పారాలకు విద్యుత్ సరఫరాను ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి, విద్యుత్ ఇంజనీర్లకు సహకరించాలని అధికారులు కోరారు.

## నేడు డయల్ యువర్ డీఎం

సైదాబాద్, డిసెంబర్ 27 : మిధాని ఆర్టీసీ డిపో డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు మిధాని డిపో మేనేజర్ విజయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 9959226139లో మేనేజర్‌తో మాట్లాడి సమస్యలను తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు.



కడ్తాల్: మండల కేంద్రంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాయకులు



షాద్‌నగర్ పట్టణ ముఖ్యకూడలిలో మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, నాయకులు

# మన్మోహన్ సింగ్ సేవలు చిరస్మరణీయం

**నివాళులర్పించిన పలువురు నేతలు**

షాద్‌నగర్‌టౌన్, డిసెంబర్ 27 : భారత మాజీ ప్రధాని, ఆర్థికవేత్త మన్మోహన్ సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంతో పాటు పట్టణ ముఖ్యకూడలిలో ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ ఆర్థిక సంక్షోభం నుంచి భారత దేశాన్ని గట్టెక్కించడంతో పాటు ప్రపంచ దేశాల సరసన ఆర్థిక వ్యవస్థల్లో మన దేశాన్ని ఒకటిగా నిలిపిన మహనీయుడు మన్మోహన్ సింగ్ అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, కౌన్సిలర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**దేశ ఆర్థిక సంస్కరణల్లో ముద్ర**

దేశ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. ఆయన మృతి పట్ల శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక సంస్కరణలు రూపొందించి తనదైన ముద్ర వేశారన్నారు.

**కడ్తాల్ :** మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఏర్పాటు చేసిన, మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వేర్వేరుగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్లు వీరయ్య, వెంకటేశ్, వెంకటయ్యయాదవ్ పాల్గొన్నారు.

**ఇబ్రహీంపట్నంరూరల్ :** నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మల్‌రెడ్డి అభిషేక్‌రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి, వైస్‌చైర్మన్ కరుణాకర్, మాజీ జడ్పీటీసీ మహిపాల్ పాల్గొన్నారు.

**ఆమనగల్లు :** పట్టణంలోని రాజీవ్‌గాంధీ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. వీరిలో టీపీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షుడు జగన్, మానయ్య ఉన్నారు.

**మన్మోహన్‌సింగ్ జీవితం ఆదర్శనీయం**

ఆమనగల్లు : ప్రధాన మంత్రిగా మన్మోహన్‌సింగ్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు రూపొందించి తనదైన ముద్ర వేశారని కొనియాడారు. ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని పేర్కొన్నారు.

**షాబాద్‌లో**

షాబాద్ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

**యాచారం :** మండల కేంద్రలంలో శుక్రవారం మన్మోహన్ సింగ్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు.

**చేవెళ్లటౌన్ :** చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకట్‌స్వామి జాతీయ జెండాను ఆవిష్కరించి మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, చేవెళ్ల పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శైలజాఆగిరెడ్డి, ప్రభాకర్, అనంతరాములు, మాజీ ఉప సర్పంచ్‌లు శ్రీనివాస్‌యాదవ్, నర్సింహులు, మహిళా అధ్యక్షురాలు సమతారెడ్డి, టీపీపీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు నరేందర్, మల్లేశ్ పాల్గొన్నారు.

**మంచాల :** మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి నివాళులర్పించారు.

## క్రీడాకారులకు బహుమతుల ప్రదానం



మొయినాబాద్, డిసెంబర్28 : మండల పరిధిలోని చిన్నషాపూర్ గ్రామానికి చెందిన చేగూరి మురళిగౌడ్ ఏడాదిక్రితం మృతి చెందాడు. తమ స్నేహితుడి జ్ఞాపకార్థం శుక్రవారం క్రికెట్ టోర్నమెంట్‌ను స్నేహితులు జగదీశ్వర్‌గౌడ్, మధురెడ్డి, రాజేశ్ నిర్వహించారు. ఇందులో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 34 జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో హిమాయత్‌నగర్‌కు చెందిన స్ట్రైకర్, కుత్బుద్దీన్‌గూడకు చెందిన స్పారైన్స్ జట్లు తలపడ్డాయి. హిమాయత్‌నగర్ జట్టు విజేతగా నిలువగా రూ. 22,222 నగదు, షీల్డ్, రెండవ స్థానంలో నిలిచిన కుత్బుద్దీన్‌గూడ జట్టుకు రూ.11,111 నగదు అందజేశారు.

## మైసమ్మ ఆలయంలో వేలం పాట



కడ్తాల్, డిసెంబర్ 27: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మతల్లి ఆలయంలో శుక్రవారం వేలం పాటను నిర్వహించారు. జిల్లా దేవాదాయ శాఖ తూర్పు విభాగం ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో స్నేహలత ఆధ్వర్యంలో అమ్మవారి ఒడి బియ్యం, చీరలు, కొబ్బరి చిప్పల సేకరణకు అధికారులు వేలం పాటను నిర్వహించారు. కాగా, గ్రామానికి చెందిన కేతావత్ పరంసింగ్ 11,40,200 లక్షలకు పాడి వేలంను దక్కించుకున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ శిరోలీపంతూనాయక్, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరి, కృష్ణ, చంద్రయ్య, రాములు, శ్రీనివాసులు, శ్రవణ్‌కుమార్, హర్షవర్ధన్, వెంకటేశ్, బీబీచారి, అమర్‌సింగ్‌నాయక్, శివరాంనాయక్, గోపినాయక్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కందుకూరు, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి బాల్‌రాజ్ కోరారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని విమర్శించారు. శుక్రవారం కార్మికులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి అధికారంలోకి వస్తే వెంటనే పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పి సంవత్సరం గడుస్తున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే నెలకు రూ. 18వేలను చెల్లిస్తానని, రూ. 10 లక్షల బీమా వసతిని కల్పిస్తానని చెప్పి నేటికి అమలు చేయక పోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపడితే పోలీసుల చేత అరెస్టులు చేయించారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైఖరికి నిరసనగా రెండు రోజుల సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. అయిన ప్రభుత్వం దిగిరాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత, రూ. 50లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యంతో పాటు గుర్తింపు కార్డులు, ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, బాల్‌రాజ్ గౌడ్, నరసింహ, హరి క్రిష్ణ, శ్రీధర్, అనిల్, అంజయ్య, యాదయ్య, గణేశ్, శోభ, జయ్యమ్మ, కళమ్మ, యశోధ, పార్వతమ్మ, జంగయ్య, ఇందిరమ్మ, బావయ్య, భిక్షపతి పాల్గొన్నారు.

# కార్పొరేషన్‌లో కమీషన్ల దందా

- ప్రతి పనికీ పర్సంటేజీల గొడవ
- అధికారుల మధ్య కొరవడిన సమన్వయం
- ఏ విభాగంలో ఎవరున్నారో తెలియని పరిస్థితి
- కమిషనర్‌కు తెలియకుండానే అభివృద్ధి పనులు
- అధికారుల మధ్య అంతర్గత విభేదాలు




బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బడంగ్‌పేట, డిసెంబర్27: బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న అధికారుల మధ్యన సమన్వయం కొరవడినట్లు తెలుస్తున్నది. కొంత కాలం నుంచి అధికారుల మధ్యన అంతర్గత విభేదాలు ఉన్నట్లు తెలుస్తుంది. ఏ అధికారి ఏంపని చేస్తున్నారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొన్నది. ఇంజినీరింగ్ విభాగంలో అధికారుల మధ్యన అంతర్గత విభేదాలు ఉన్నట్లు పలు సందర్భాలలో బహిర్గతమయ్యాయి. కొంత మంది అధికారులకు ఉన్న డివిజన్లను తగ్గించడం, కొంత మంది అధికారులకు సంతకం పవర్ తగ్గించడం వంటి సమస్యలతో ఒకరంటే ఒకరికి గిట్టడం లేదు. ఓ అధికారిని అంతా తానై పనిచేయడంతో మిగతా అధికారులలో అసంతృప్తి మొదలైందని చర్చ జరుగుతుంది. మున్సిపల్ కార్పొరేషన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల గురించి ఓ పెద్ద మనిషి ఆరా తీశారు. చేస్తున్న పనుల గురించి కమిషనర్‌ను అడగడంతో ఆమె నాకు తెలియదని సమాధానం ఇచ్చారు. పక్కనే ఉన్న ఏఈలను అడుగగా వారు నీళ్లు నమిలారు. కమిషనర్‌కు తెలియకుండా అభివృద్ధి పనులు చేస్తున్నారా అంటు పెద్ద మనిషి అడిగారు. అసలు బడ్జెట్ ఎంత ఉంది పనులు ఎలా చేస్తున్నారన్న ప్రశ్నలకు అధికారుల దగ్గర సమాధానం లేదు. బడ్జెట్ లేకుండానే అడ్డగోలుగా పనులు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ ఏ విభాగంలోను అధికారుల మధ్యన సయోధ్య కుదరడం లేదు. వీరి మధ్యన పర్సంటేజీలు గొడవలు జరుగుతున్నట్లు గుస గుసలు వినిపిస్తున్నాయి. గతంలో పనిచేసిన అధికారులు బదిలీ కావడంతో కొత్తగా వచ్చిన అధికారుల మధ్యన సమన్వయం లోపించడం వల్లనే బడంగ్‌పేట మున్సిపల్ కార్యాలయంలో లుకలుకలు మొదలైనట్లు తెలుస్తుంది.

**ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు పెండింగ్..**

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు ఇంత కాలం ఎందుకు పెండింగ్ ఉన్నాయని ఆరా తీస్తున్నట్లు తెలిసింది. పెండింగ్ ఫైల్స్ గల కారణాలు ఏమిటో వివరణ అడుగుతున్నట్లు సమాచారం. నోటీసులు జారిచేసి వివరణ అడిగారని సమాచారం. ఇంత కాలం ఫైల్స్ ఎందుకు పెండింగ్ ఉన్నాయని ఉన్నతాధికారులు గరం గరంగా ఉన్నట్లు తెలిసింది. అదే విషయంలో మున్సిపల్ అధికారులకు నోటీసులు జారి చేసినట్లు సమాచారం. ఎల్‌ఆర్‌ఎస్ ఫైల్స్ వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉండటం పై అధికారులు కారణాలు అడుగుతున్నారు. ప్రశ్నలకు మున్సిపల్ అధికారుల దగ్గర సమాధానం లేదు.